యాదగిరీశుడికి సుప్రభాత సేవ

● ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ

స్వామి వారికి నిత్య పూజలు చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి సన్నిధిలో స్వామి, అమ్మవార్ల సుప్రభాత సేవోత్సవాన్ని అర్చకులు అత్యంత వైభవంగా జరిపారు. శుక్రవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు స్థాన సుప్రభాతాన్ని ఆలకించి స్వయంభూ నరసింహ స్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల పాదాల వద్ద 108 బంగారు పుష్పాలు ఉంచి అష్టోత్తర నామాలు పఠిస్తూ అర్చించారు. అనంతరం స్వామివారికి హారతినిచ్చి భక్తుల గోత్రనామాలు పేరిట సంకల్పం చేశారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణ తంతు జరిపించారు. కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్టించి గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతును జరిపారు. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం వేళ స్వామివారికి తిరువీధి సేవ, దర్బార్‌సేవ అత్యంత వైభవంగా చేపట్టారు. రాత్రి వేళ స్వామివారికి తిరువారాధన చేపట్టి, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా సాగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 11వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అనుబంధ పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉదయం సరస్వతి అష్టోత్తరం, లలితా సహస్రనామార్చన, పారాయణాలు, జపాలు, కుంకుమార్చన నిర్వహించారు. సరస్వతీ దేవి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.15,73,167 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి తెలిపారు.

కొండపై బతుకమ్మ సంబురాలు

యాదగిరిగుట్ట, అక్టోబర్ 20 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయ మాఢవీధుల్లో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. తూర్పు మాఢవీధుల్లో మహిళలు బతుకమ్మ ఆడిపాడి సందడి చేశారు. రంగురంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి బతుకమ్మ చుట్టూ తిరుగుతూ బతుకమ్మ పాటలతో సంబురాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎన్.గీత, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి జిట్టా బాలకృష్ణారెడ్డి

● మంత్రి కేటీఆర్ సమక్షంలో చేరిక

భువనగిరి కలెక్టరేట్, అక్టోబర్ 20 : తెలంగాణ ఉద్యమ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఆయనకు గులాబీ కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో భువనగిరి ప్రాంతంలో ఉద్యమాన్ని ఉవ్వెత్తున ముందుకు నడిపించిన నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అని కొనియాడారు. అటువంటి నాయకుడు బీఆర్ఎస్‌లో చేరడం సంతోషకరమన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయ పార్టీ లేదని, కేసీఆర్‌కు సాటి ఎవరూ రారని చెప్పారు. భువనగిరిలో మూడోసారి పైళ్ల శేఖర్‌రెడ్డి గెలుపు తథ్యమన్నారు.

బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి

● హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

గరిడేపల్లి : సర్వారంలో బీఆర్ఎస్‌లో చేరిన వారితో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

గరిడేపల్లి, అక్టోబర్ 20 : బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాలు అభివృద్ధి చెంది ప్రజలంతా ఆనందంగా ఉన్నారని హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. మండలంలోని సర్వారం గ్రామానికి చెందిన సలికంటి శ్రీను, సైదిరెడ్డి, సిద్ధ రామయ్య, సిద్ధ లక్ష్మయ్య తదితరులు స్థానిక సర్పంచ్ కర్నాటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలతో అన్ని రంగాలు అభివృద్ధి పథంలో దూసుకు పోతున్నాయన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన అభివృద్ధిని చూసి అన్ని పార్టీల వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని చెప్పారు. అంతకుముందు గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

కార్యక్రమంలో సర్పంచ్ కర్నాటి నాగిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బారెడ్డి గోవిందరెడ్డి, నాయకులు పెండెం సైదులు, గుమ్మడెల్లి రాముడు, పగిడి అంజయ్య, కర్నాటి శ్రీనివాస్ రెడ్డి, బోగాల జనార్దన్‌రెడ్డి, బరిగెల కృష్ణ, తేలరవి పాల్గొన్నారు.

రామన్నపేటలో కురుమ, హమాలీ సంఘాల నాయకులకు గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

బీఆర్ఎస్‌ది రైతు రాజ్యం

● నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

రామన్నపేట, అక్టోబర్ 20 : బీఆర్ఎస్ పార్టీది రైతు రాజ్యమని, ప్రతి గడపకూ సంక్షేమ పథకాన్ని అదించిందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండల కేంద్రానికి చెందిన వంద కుటుంబాల వారు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ఆకాంక్షగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని గడప గడపకూ వెళ్లి ప్రచారం చేయాలని, పార్టీ గెలుపునకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. పార్టీలో చేరిన వారిలో కురుమ సంఘం ఉపాధ్యక్షుడు ఈతాకుల రాజు, హమాలీ సంఘం నాయకులు ఏనుగు నర్సింహ, మోటె అంజయ్య, మోటె మొగులయ్య, రేగు జంగయ్య, బెడద మల్లయ్య, గొరిగే శ్రీశైలం, ఊట్కూరి నరేశ్, ఊట్కూరి ఉపేందర్, గాదె రాజు, శంకరయ్య, గుండాల సత్తయ్య, నాగటి అంజయ్య, నకిరేకంటి గోపాల్, సింగం మల్లయ్య ఉన్నారు. బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పోతరాజు సాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గొరిగే నర్సింహ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోశబోయిన మల్లేశం, నాయకులు జాడ సంతోష్, బందెల రాములు, బలరాం, రమేశ్, శివనారాయణ, శివ, రాము, ఇనాయత్‌బేగ్, లక్ష్మణ్, నాజర్, సమ్మయ్య, మన్సూర్ అలీ, ఉపేందర్, అంజద్, రాజు, నరేశ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ ఎజెండా

● నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

ఎమ్మెల్యే భగత్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకుడు రవిగౌడ్

నిడమనూరు, అక్టోబర్ 20 : ప్రజా సంక్షేమమే బీఆర్ఎస్ పార్టీ ఎజెండా అని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ అన్నారు. మండలంలోని ఊట్కూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నర్సింగ్ రవిగౌడ్ శుక్రవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. సబ్బండ వర్గాల సంక్షేమానికి కృషి చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని, ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ ప్రచారం చేసి పార్టీ గెలుపునకు దోహదపడాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నందికొండవారిగూడెం సర్పంచ్ కొండ అంజమ్మాజానయ్య, ఎంపీటీసీ బత్తిని రాధానరేందర్, బీఆర్ఎస్ నాయకులు కేశబోయిన జానయ్య గౌడ్, నర్సింగ్ లచ్చయ్య గౌడ్, బొల్లెంపల్లి వెంకటేశం, బొల్లం సైదులు, చిత్రం జీవన్‌రావు, నాగయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

● మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 20 : రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధిని చూసే వివిధ పార్టీల నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సర్వేల్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ 11వ వార్డు సభ్యుడు ఈసం పరమేశ్, గుజ్జు గ్రామంలో బీజేపీకి చెందిన రాచకొండ రాజు, తోకల భిక్షపతి, నల్లకంటి వేణు ఎమ్మెల్యే సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వీరమల్ల భానుమతి, సర్పంచ్ యాదవరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీధర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కత్తుల లక్షయ్య, గ్రామ శాఖ అధ్యక్షుడు సత్తయ్య, నాయకులు సత్తిరెడ్డి, పగిళ్ల శ్రీకాంత్, సైదులు పాల్గొన్నారు.